క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

గద్వాల అర్బన్: మండలంలోని బీరెల్లికి చెందిన బీసన్న రోజువారి కూలీగా పని చేస్తూ జీవనం సాగించేవాడు. నెల రోజు క్రితం పని నిమిత్తం వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై కుడికాలును కోల్పోయాడు. వైద్యుల సూచన మేరకు కృత్రిమ కాలును అమర్చుకునేందుకు ఆర్థిక స్తోమత లేదు. విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సోమవారం గ్రామానికి చేరుకుని బీసన్నకు రూ.45వేల అందజేశారు. కార్యక్రమంలో అశోక్, మోహన్, శ్రీనివాసులు, మురళీ, వెంకటేష్, నాగేష్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

అయిజ: ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురంలో కర్నూలుకు చెందిన మధు డ్రామా కంపెని వారు 'విరాట్ పోతులూరి వీర బ్రహ్మం జీవిత చరిత్ర' నాటకాన్ని ప్రదర్శించారు. తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల వారు తరలివచ్చారు. నాటకాన్ని ప్రదర్శించిన కళాకారులకు ప్రజలు కానుకలు సమర్పించారు.

పార్టీ బలోపేతానికి కృషిచేద్దాం

అయిజ: పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషిచేద్దామని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు చేసుకుంటుందని, ఇది కేవలం ఎన్నికలకోసమేనని అన్నారు. రైతులకు రుణమాఫీ ఇంతవరకు చేయలేదని, వడ్డీలు కట్టలేక రైతులు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు.

12శాతం రిజర్వేషన్ అమలుకు డిమాండ్

గద్వాల అర్బన్: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారని, వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని మైనార్టీ సబ్ ప్లాన్ జిల్లా చైర్మన్ అతిఖుర్ రహ్మాన్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ముస్లిం, మైనార్టీల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముస్లింలకు ఉర్దూ మీడియం బాలుర ఉన్నత పాఠశాల, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా విద్యలో, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం విద్యార్థులకు స్కాలర్‌షిప్, రిఎంబర్స్‌మెంట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో మక్బూల్, నస్రుల్లా, రహీమత్, సుభాన్, కౌసర్ బేగ్ తదితరులు ఉన్నారు.

అభ్యంతరాలపై ఫిర్యాదు చేయండి

అలంపూర్: వరద బాధితుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ సుభాష్ నాయుడు ప్రకటనలో కోరారు. 2009 వరద బాధితుల పట్టాలను కలెక్టర్ ఆదేశాలతో తిరిగి తీసుకున్నట్లు పేర్కొన్నారు. 8 బృందాలు ఇంటింటికీ తిరిగి తీసుకున్న పట్టాలపై విచారణ చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం అర్హులు, అనర్హుల జాబితా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. జాబితాలను తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల బోర్డులపై ఉంచినట్లు తెలిపారు. వీటిపై అభ్యంతరాలుంటే ఈ నెల 7వ తేదీ లోపు తహసీల్దార్ కార్యాలయంలో రాతపూర్వక ఫిర్యాదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి

అలంపూర్ రూరల్: ఆశా వర్కర్లకు ఖచ్చితమైన వేతనాలు చెల్లించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసూనరాణికి వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇచ్చి, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, ప్రమీల, నాగేశ్వరమ్మ, చిట్టెమ్మ, చంద్రకళ, జయమ్మ, బీసమ్మ, కృష్ణవేణి, మమత తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. కోరం లేకపోవడంతో సమావేశం రద్దు చేసినట్లు ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి ప్రకటించారు. సభను మంగళవారానికి వాయిదా వేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీని కలిసిన ఆలయ చైర్మన్

అలంపూర్: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని కర్నూల్‌లోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. చైర్మన్‌తోపాటు పాలక మండలి సభ్యులు ఎమ్మెల్సీని శాలువాతో సత్కరించారు.

ప్రత్యేక రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- ఘనంగా విద్యుత్ విజయోత్సవాలు



అలంపూర్ చౌరస్తాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, చిత్రంలో ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథం, ఎమ్మెల్యే వీఎం అబ్రహం తదితరులు

అలంపూర్: దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం విద్యుత్ విజయోత్సవాలను అలంపూర్ చౌరస్తాలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథం, ఎమ్మెల్యే డా. వీఎం అబ్రహం, విద్యుత్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యుత్‌శాఖ డీఈ లక్ష్మణ్‌నాయక్ జిల్లాలో విద్యుత్‌శాఖ ప్రగతిని వివరించారు. అనంతరం తెలంగాణ ఆవిర్భావం తర్వాత విద్యుత్‌శాఖ సాధించిన ప్రగతి, సీఎం కేసీఆర్ సందేశాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యుత్ సరఫరాలో వచ్చిన భారీ మార్పులు ప్రజలందరికి తెలుసన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సమస్యలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ సారథ్యంలో గ్రామాల్లోనూ నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగుతుందని తెలిపారు. ఈ నెల 12న సీఎం కేసీఆర్ జిల్లాకు వస్తున్నారని.. పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పోరాట ఫలితమే స్వరాష్ట్రం..

స్వరాష్ట్ర ఆకాంక్ష అంత సులభంగా సిద్ధించలేదని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథం అన్నారు. వేలాది మంది పోరాటాలు, అమరుల త్యాగ ఫలంతో స్వరాష్ట్రం వచ్చిందని తెలిపారు. చట్టసభల్లో ప్రత్యేక రాష్ట్ర అభిలాషను బలవంతంగా అడ్డుకొనే ప్రయత్నం జరిగిందని.. తెలంగాణ ప్రజాప్రతినిధులు ప్రతిఘటించి రాష్ట్రాన్ని సాధించారని వివరించారు. రాష్ట్రంలో ప్రగతిని సాధించడంతోనే ఆవిర్భావ దినోత్సవాలను జరుపుకొంటున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని ఆదర్శంగా ముందుకు తీసుకెళ్తున్నారని.. అభివృద్ధిలో భాగస్వాములు కావడం ఎంతో గర్వంగా ఉందని వివరించారు.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్..

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే డా. వీఎం అబ్రహం అన్నారు. 2014కు ముందు కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. పంటలకు నీరు పెట్టడానికి రైతులు పొలాల వద్ద పడిగాపులు పడే పరిస్థితి ఉండేదని.. కేసీఆర్ సీఎం అయ్యాక విద్యుత్‌శాఖలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని వివరించారు. రైతులు ఇబ్బందులు పడకుండా 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నారని.. ఇందుకోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 101 యూనిట్లు, కులవృత్తుల వారికి 250 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏలు చిన్న మక్బూల్, గోవిందు, ఏఈలు సుబ్బారాయుడు, బాలస్వామి, సత్తార్‌బాషా, వెంకటేశ్వర్లు, ఏపీపీలు బీసమ్మ, అశోక్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు అనురాధ, దేవన్న, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు మనోరమ, కరుశ్రీ, పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి, నాయకులు, రమణ, నాగేశ్వర్‌రెడ్డి, విక్రంసేనారెడ్డి, ఇస్మాయిల్, గోకారి, బీచుపల్లి, సీతారామిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

మానవపాడు: ఎన్నో ఏళ్లుగా ప్రజలు పడుతున్న ప్రజల ఇబ్బందులు త్వరలోనే తీరుతాయని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. సోమవారం మండలంలోని ఏ.బుర్దిపాడులో బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు రూ.15లక్షలు మంజూరు చేశామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఎంపీటీసీ భరత్‌సింహారెడ్డి, రాముడు, కుర్వ సత్యన్న, చెన్నకృష్ణారెడ్డి, దేవరాజు, దేవదానం, విద్యసాగర్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

అలంపూర్: వరదల్లో మునిగి సర్వం కోల్పోయిన తమకు న్యాయం చేయాలని సంతమార్కెట్ కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్రహంను మున్సిపాలిటీలోని సంత మార్కెట్ కాలనీ వాసులు సోమవారం కలిశారు. 2009లో వచ్చిన వరదల్లో పట్టణంతోపాటు కాలనీ నీట మునిగిందని తెలిపారు. వరదల సమయంలో విచారణ చేసిన అధికారులు సంతమార్కెట్ కాలనీకి చెందిన ఒక్కరికి కూడా ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. కాలనీలో అందరూ దినసరి కూలీలు ఉన్నారని, 2009 కంటే ముందు 2007లోనూ మా కాలనీ ముంపునకు గురైందని గుర్తు చేశారు. ఇప్పుడైన కాలనీ వాసులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.

కొలతల ప్రకారం పనులు చేయండి



పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రవీంద్ర

శాంతినగర్: కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీడీఓ రవీంద్ర సూచించారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల సమీపంలో చేపడుతున్న కాల్వ పూడికతీత పనులను ఎంపీడీఓ సోమవారం పరిశీలించారు. మండలంలో మొత్తం 938 మంది కూలీలు ఉపాధిపనికి వచ్చినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్ రాఘువేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

బీసీ కమ్యునిటీహాల్‌కు నిధులు మంజూరు


అలంపూర్: బీసీ కమ్యునిటీ హాల్‌కు ఎమ్మెల్యే నిధులు కేటాయించినట్లు సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. అలంపూర్‌చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో లక్ష్మణ్ గౌడ్, నర్సింహ, వెంకట్రాముడు, సైదులు, మద్దిలేటి ఎమ్మెల్యే అబ్రహంను సోమవారం కలిసినట్లు తెలిపారు. ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడులో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే రూ. 13 లక్షలు కేటాయించి ప్రొసిడింగ్ కాపీ అందజేసినట్లు తెలిపారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



గద్వాల క్రైం: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ అనిరోజ్ క్రిస్టియన్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. మానవ మనుగడకు జీవనధారం, స్వచ్ఛమైన గాలి, ప్రకృతి పరమైన అందాలు మొక్కల నుంచే అందుతాయన్నారు. అనంతరం పట్టణంలోని ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కవిత, ఉదయ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, ఆదిమల్లారెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



గద్వాల: ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో నిర్వహించే సీనియర్ మెన్, ఉమెన్ జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పట్టణానికి చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గతనెల మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరిలో రాష్ట్రస్థాయి పోటీలలో వివిధ విభాగాలలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 54 కేజీల విభాగంలో చంద్రశేఖర్, 63 కేజీల విభాగంలో రాజ్‌కుమార్, 74 కేజీల విభాగంలో ఉదయ్‌కిరణ్ ఎంపికయ్యారు. 53 కేజీల విభాగంలో ధరూర్‌కు చెందిన వినోద, 57 కేజీల విభాగంలో గాయత్రి, ఫుంస్ విభాగంలో మౌనిక ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు కరాటే మాస్టర్ శ్రీహరి అభినందనలు తెలిపారు.

పోషకాహారం తీసుకోవాలి



అలంపూర్‌లో సీమంతాలు చేస్తున్న సీడీపీఓ సుజాత

అలంపూర్ రూరల్: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్ జయమ్మ పాల్గొని గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏమేలమ్మ, శాంతమ్మ, నర్మద, మాధవి, లక్ష్మీకాంతమ్మ, రూపాప్రియ, పుష్పవతి, సావిత్రి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని డీడబ్ల్యూఓ ముసాయిదాబేగం అన్నా రు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో గంజిపేటలోని 1, 2, 4వ అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన, సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు పండ్లు, పూలు అందజేశారు.


మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీడీపీఓ కమలాదేవి సూచించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు బూడిదపాడు, పెద్దపల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాలలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు

గట్టు: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలూరు, మాచర్ల, ముచ్చోనిపల్లెలో కంటి పరీక్షలను నిర్వహించారు. మూడు గ్రామాల్లో మొత్తం 392 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, 22 మందికి కంటి అద్దాలను పంపిణి చేయగా, 33 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు సీహెచ్ఓ ఉసేని తెలిపారు.

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డిలో సర్పంచ్ సువార్తమ్మ ఆధ్వర్యంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామాలలో కంటి సమస్యలతో బాధపడే వారు డాక్టర్లతో కంటి పరీక్షలు చేయించుకొని అవసరమైన వారు అద్దాలు తీసుకోవాలన్నారు. కంటి పరీక్షల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.

దేశం అభివృద్ధిలో దూసుకెళ్తోంది: బీజేపీ



మాట్లాడుతున్న రామచంద్రుడు

ఉండవెల్లి: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధిలో దూసుకెళ్తుందని బీజేపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నాయకులు మోదీ 9 ఏళ్ల పాలనపై సమావేశం నిర్వహించారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30 వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై పట్టు సాధిస్తామని తెలిపారు. సాయంత్రం రైతుల ఆధ్వర్యంలో ఎద్దుల బండ్లపై ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్, పిడుగు వెంకటేష్, నరసింహులు, మహేంద్ర పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. పట్టణంలోని ఉపాధి హామీ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బేగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే, తహసీల్దార్ సుభాష్ నాయుడు, ఎంపీడీఓ గోవిందురావు, జెడ్పీటీసీ శంషాద్‌ఇస్మాయిల్, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరయ్యారు. మండలంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల గురించి అధికారులు వివరించారు. సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో రైతులకు, గృహ ఉపయోగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తుందన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాలు, మిషన్ కాకతీయతో చెరువుల పూడికతీతలు పనులు చేపట్టినట్లు తెలిపారు. అధికారులు సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో అధికారులు భాగస్వాములు కావాలన్నారు. ఆర్డీఎస్ ఆయకట్టులోని 87,500 ఎకరాలకు సాగు నీరు అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనురాధ, కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న రవిప్రసాద్‌గౌడ్

గద్వాల: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌గౌడ్ విమర్శించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపడుతామని ప్రక్రియను ప్రారంభించిన ప్రభుత్వం, వివిధ కారణాల వల్ల మధ్యలోనే నిలిపివేసిందన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కనీస మౌలిక వసతులు కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల పీఆర్సీ బకాయిలు, సెలవు వేతనం, పదవి విరమణ బెనిఫిట్స్, జీపీఎఫ్, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ తదితర సప్లిమెంటరీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి గోపాల్, రమేష్, చక్రధర్, రమణ, బీసన్న, కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేద్దాం

మల్దకల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 12న నిర్వహించే ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని వేద పాఠశాలలో నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గద్వాలలో బహిరంగ సభకు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

గట్టు: సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని రైతువేదికలో కార్యకర్తలతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం పర్యటనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అయిజ రోడ్డులో మధ్యాహ్నం బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

అలంపూర్: సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభను జయప్రదం చేద్దామని ఎమ్మెల్యే అబ్రహం పిలుపునిచ్చారు. చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభ పోస్టర్‌లను ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా కలెక్టరేట్ సమీకృత భవనం, ఎస్పీ కార్యాలయం, బీఆర్ఎస్ భవనం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఎవరి కోసం దశాబ్ది ఉత్సవాలు?



ఉండవెల్లిలో ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఉండవెల్లి: ఎవరి కోసం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని బీఎస్పీ నాయకులు ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ నాయకులు ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. ఎక్కడ చూసినా రైతులకు 24 గంటల కరెంట్ లేక ఇబ్బందులు పడుతుంటే, ఉత్సవాలు ఎందుకు చేస్తున్నారన్నారు. 23వేల మంది ఆర్టిజెన్ ఉద్యోగులను ఎందుకు రెగ్యులర్ చేయ్యలేదన్నారు. పేద ప్రజలకు 100 యూనిట్ల వరకు ఉచితమని ఇచ్చిన హామీ, రజకులకు, నాయి బ్రాహ్మణులకు 250 యునిట్లు ఉచితంగా ఇస్తామన్న హామీ మరిచారన్నారు. కార్యక్రమంలో మహేష్, మధు, రవిచందర్, ప్రభుదాసు, జలంధర్, దస్తగిరి, నాగేంద్ర పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు



ముస్తాబైన శివాలయం

అయిజ: పట్టణంలోని పెద్ద ఆంజనేయస్వామి ఆలయం పక్కన కొత్తగా నిర్మించిన శివాలయంలో బుధవారం నుంచి గురువారం వరకు శివలింగ ప్రతిష్ఠాపనతోపాటు గణపతి, కుమారస్వామి, భవాని, నవగ్రహ, నాగ విగ్రహాల ప్రతిష్టపూజలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం వేద పండితులు గణపతిపూజ, స్వస్తి పుణ్యాహావాచనం, పంచాంగవ్య ప్రాశనం, పంచాంగావ్య పోశనం , రక్షాబంధనం, ఆచార్యాది రుత్విక్ వరనం, అంకురారోపరనం, షోడశస్తంభ పూజ, యాగశాల ప్రవేశం, నాంది దేవత ఆవాహనం, షోడశోపవార పూజ, అఖండ దీపారాదనం, అగ్నికార్యం, దీక్షాహోమం, గణపతి హోమం, శాంతి హోమం, వాస్తు హోమం, వాస్తు మండల ఆరాధన, మూలమంత్ర అనుష్టానములు, రుద్ర హోమం, నవగ్రమ హోమం, మన్యు సూక్త పారాయణములు, మూలమంత్ర జపములు, అభిషేకం, మహామంగళ హారతి, మంత్ర పుష్పం, ప్రదోశకాల, షోడశోపాచార పూజ, జలాదివాసము, ధాన్య దివాసం, పుష్పాదివాసం, శయ్యాధివాసం, మహాస్నపనం, మంగళ హారతి, రజోపచారలు, మహా మంగళ హారతి, వేదస్వస్తి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించనున్నారు.

రెండవరోజు పూజలు

గురువారం ఉదయం ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమం, మూలమంత్ర అనుష్టానములు, వాస్తుహోమం, రుద్రహోమం, మన్యు హోమం, నారాయణ హోమం, రక్షా హోమం, శాంతి హోమం, ఆవాహిత దేవతా హోమములు నిర్వహించనున్నారు. అదేవిధంగా మిథున లగ్న పుష్కరాంశమున విగ్రహ ప్రతిష్ఠాదులు, స్థిరీకరణములు, ప్రతిష్టహోమాలు, దిగ్బాలి ప్రధానం, ప్రాణ ప్రతిష్ట, బింబు కలాన్యాసాదులు, పూర్ణాహుతి, కళోద్యాసన, మూర్జన ప్రథమ దర్శనం, అర్చన, మంగళహారతి, మహాదాశీర్వచనములు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



తిమ్మాజిపల్లిలో మొక్కలు నాటుతున్న యువకులు

శాంతినగర్: పర్యావరణాన్ని కాపాడుకోడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్‌సీసీ అధ్యక్షుడు వీరేష్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని తిమ్మాజిపల్లిలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం గ్రామ ప్రజలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. రోటరీ కార్ప్స్ తిమ్మాజిపల్లి ఆధ్వర్యంలో గతంలో పాఠశాల ఆవరణలో వెయ్యి మొక్కలు నాటామన్నారు. దీంతో పాఠశాల పచ్చదనంతో కళకళలాడుతోందన్నారు. చెట్లు పెంచడం వల్ల హరితవాతావరణం ఏర్పడుతుందన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు మొక్కలు పెంచి వాతావరణాన్ని రక్షించి భావితరాలకు ఆరోగ్య వాతావరణాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. అంతేగాక ప్రతి పౌరుడు సహజవనరులను సామాజిక బాధ్యతగా భావించి రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగేష్‌యాదవ్, కుమార్, నవీన్, తిరుమల్, బలరాం, కృష్ణ, ఉసేన్, వినోద్‌కుమార్, రామాంజి, గోవింద్ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



చర్చావేదికలో నివేదికలను చదువుతున్న ఆడిట్ బృందం

గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలతో పాటుగా రికవరి చేయిస్తామని అడిషనల్ డీఆర్‌డీఓ నాగేంద్రం హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరగ చర్చావేదిక నిర్వహించారు. గ్రామాల వారీగా చేపట్టిన ఉపాధి పనులపై ఆడిట్ బృందం వారం రోజులుగా క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులపై నివేదికను తయారు చేసి, చర్చావేదికలో చదివి వినిపించారు. ఉదయం నుంచి రాత్రి వరకు సమావేశాన్ని కొనసాగించారు. మండలంలో 2020 నుంచి 2023 వరకు చేపట్టిన రూ.11,87,55,316 పనులకు ఆడిట్ నిర్వహించారు. ఇందులో రూ.9,36,82,994 కూలీలకు, రూ.2,50,72,322లను మెటీరియల్‌కు చెల్లింపు చేశారు. ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ వీఎస్‌ఏలు మొత్తం 50 మంది సభ్యులు 13 రోజుల పాటు తనిఖీలను చేపట్టారు. పంచాయతీల్లో మొక్కలకు సంబంధించిన రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, మినిట్స్ రాయక పోవడంపై డీఆర్‌డీఓ అసంతృప్తిని వ్యక్తం చేశారు. తప్పెట్లమొర్సులో పీఆర్ పనులకు సంబంధించి రికార్డులు ఇవ్వలేదని ఆడిట్ అధికారులు తెలిపారు. ముచ్చోనిపల్లెలో పావని, రాజమ్మల హాజరు వేసి, సంతకాలు లేకుండానే చెల్లింపులు చేశారని ఆడిట్ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. హరితహారంలో నాటిన మొక్కలు 10 నుంచి 15 శాతం వరకు దెబ్బతిన్నట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. గ్రామాల్లో మొక్కలు నాటి ఎండినపోయిన ప్రదేశాల్లో జూన్ 19న అన్ని పంచాయతీల్లో మొక్కలను నాటేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు నాగేంద్రం తెలిపారు. కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి పక్కన నాటిన మొక్కలు రోడ్డు విస్తీర్ణం కారణంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి శ్రీనివాస్, ఏఆర్ అంజయ్యగౌడ్, అంబుడ్స్‌మెన్ జమ్మన్న, ఎస్ఆర్‌పీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.